: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 39 | 26-06-2023 | పుటలు : 4




## బక్రీద్

**జూన్ 29**

హృదయంలోని సత్యమే భగవంతుని వరకు చేరుతుంది. మంచి నడవడితో కూడిన జీవితమే ఇహ పరలోకాల్లో మనిషిని సాఫల్య శిఖరాలకు చేరుస్తుంది. పేదలకు దానం ఇవ్వటం బక్రీద్ పండుగలోని అంతర్లీనమైన భావన.ఖుర్బాని అంటే దానం, త్యాగం, సమర్పణ ద్వారా దైవసాన్నిధ్యాన్ని పొందటం.

బక్రీద్ శుభాకాంక్షలతో....

- నన్నయవాణి

## జూన్ 26

## ఇంటర్నేషనల్ డే ఎగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్ అండ్ ఇల్లిసిట్ ట్రాఫికింగ్

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం.**




పొగ పీల్చడం ఫ్యాషన్ కాదు. వ్యసనం. తర్వాత అది మిమ్మల్ని పిలుస్తుంది. డ్రగ్స్ ఎడిక్షన్ ఒక జబ్బు. అది ముదిరేకొద్ది ఆరోగ్యానికి ప్రమాదమే. మాదకద్రవ్యాలు మెదడుమీద తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి కాబట్టి చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నట్లే. మత్తు మనదాకా రాలేదనుకోకండి. ప్రక్కనే పొంచి ఉంది. ప్రతి ప్రమాదమూ అంతే!

ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావటానికి మీరంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష!!

- నన్నయవాణి

## మంచిమాట



ఇస్లాంలో అన్నిటికన్నా ఉత్తమమైన ఆచరణ ఏది? అని ఒక వ్యక్తి మహమ్మద్ ప్రవక్తని అడిగాడు. దానికాయన "ఆకలిగొన్న వారికి అన్నం పెట్టటం" అని సమాధానం ఇచ్చారు.




# పట్టుదలతోనే విజయం

**23.06.23 (మీడియాసెల్)**

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా మనం విజయం సాధించవచ్చని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నతవిద్య ప్లానింగ్ బోర్డు ఆదేశాలతో అంతర్ విశ్వవిద్యాలయాల రీజనల్ గోదావరి క్లస్టర్ క్రీడలు శుక్రవారం రాజమహేంద్రవరం నన్నయ విశ్వవిద్యాలయంలో ప్రారంభమయ్యాయి. రెండురోజులపాటు జరిగే ఈ పోటీలను ఉపకులపతి కె. పద్మరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో క్రీడలకు అధికప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గోదావరి క్లస్టర్లో నన్నయతోపాటు జేఎన్టీయూకే, వైయస్ఆర్ హార్టికల్చర్, ఎన్ఐటీ ఇలా నాలుగు ప్రత్యేక రంగాల విద్యార్థులంతా ఒకచోట కలిసి ఆడుకోవటం ఆనందంగా ఉందన్నారు. క్రీడలైనా, ఐఏఎస్, ఐపీఎస్ సాధించాలన్నా పట్టుదల అనే పెట్టుబడి ఉంటే సాధించలేనిదేదీ లేదన్నారు. క్రీడల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రమణేశ్వరి మాట్లాడుతూ నాలుగు వర్సిటీలకు కబడ్డీ, బాస్కెట్బాల్, వాలీబాల్, చదరంగం క్రీడలు నిర్వహిస్తున్నామని ఈ పోటీలకు సుమారు 250మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. తొలుత నాలుగు వర్సిటీల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ఫాస్ట్ నిర్వహించి ఉపకులపతికి గౌరవ వందనం సమర్పించారు. క్రీడల కార్యదర్శి డా.రాంగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ టి.అశోక్, వర్సిటీ ఆచార్యులు, అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉపకులపతి ఉవాచ



**మన ఆరోగ్యం మన చేతుల్లో....**
**(మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం)**

**విద్యార్థులారా!**

నాణానికి ఖిలం ఉంటుంది. అది నాణెంతోపాటు చలామణి అయిపోతుంటుంది. నాణెం విలువైంది. ఖిలానికి విలువలేదు. మంచితోపాటు చెడుకూడా సమాజంలో చలామణి అయిపోతుంది. ఏది చెడో గమనించుకోవాల్సిన బాధ్యత మనదే.

విజయ శిఖరాలపై గెలుపు జెండాలునిలిపి ఉరకలేసే వయస్సు మీది. ఇప్పుడే ప్రతి అడుగు జాగ్రత్తగా పడాలి. మన మనసును, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవటం మనచేతుల్లోనే ఉంది. ఏది సాధించాలన్నా ఆరోగ్యంగా బ్రతకాలన్న ఆశే గొప్పది.

మత్తు మనదాక రాలేదనుకోకండి. ప్రతిప్రమాదం మనప్రక్కనే పొంచి ఉంటుంది. డ్రగ్స్ వ్యసనంలో మొదటి శత్రువులు స్నేహితులే. ఒకసారి తీసుకుంటే ఏమవుతుందిలే అనే దురభిప్రాయమే జీవితాన్ని నాశనం చేస్తుంది. డ్రగ్స్ కి అలవాటు పడితే చదువు,కెరీర్ నాశనమైనట్లే. చాప క్రింద నీరులా డ్రగ్స్ సామాన్యుల ఇళ్లల్లోకి, విద్యార్థుల చేతుల్లోకి వచ్చేస్తున్నాయి. ఒక మనిషి నుంచి మరో మనిషికి అంటుకునే వ్యాధి ట్రాఫికింగ్. డ్రగ్స్ ని మనకంటించే దుష్టులతో అప్రమత్తంగా ఉండండి.

మత్తుతో చెలగాటం ప్రాణాలకు ముప్పు అనే విషయాన్ని గుర్తెరిగి ప్రవర్తించండి. పిల్లలైనా, పెద్దలైనా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణమౌతుంది. ఈ నాలుగు మాటలు గుర్తుపెట్టుకుంటే చేతులుకాలే పరిస్థితి రాదు. ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయం మనందరికీ తెలిసిందే!!

ఆచార్య కె.పద్మరాజు

# యోగా జీవితంలో ఒక భాగం కావాలి




తొమ్మిదవ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ప్రత్యేక అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పాల్గొన్నారు.వీసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాని జీవితంలో ఒక భాగం చేసుకోవాలని ప్రతినిత్యం యోగ సాధన చేయడం ద్వారా శారీరక అభివృద్ధి,మానసిక వికాసం పొందవచ్చునని విశ్వవిద్యాలయంలో కూడా యోగా పై వివిధ కోర్సులు ప్రవేశపెడతామని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఈ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి గ్రామానికి యోగ యొక్క ప్రాధాన్యాన్నిను తెలియజేయాలని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య అశోక్ మాట్లాడుతూ విద్యార్థి దశనుండి యోగసాధన చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.కానవరం శ్రీరాపర్తి రామ యోగ ఇనిస్టిట్యూట్ కి చెందిన డా.ఎంవిజీఎస్ శర్మ, ప్రిన్సిపాల్ ఎన్.శివశంకర్, యోగటీచర్ కె. అప్పలరాజు ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలు అధ్యాపకులు, విద్యార్థుల చేత వేయించి వాటి ప్రాధాన్యాన్ని, ఆరోగ్యపరంగా వాటి ప్రయోజనాలను వివరించారు. వివిధ యోగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు, ఎంపీఈడి స్టాఫ్ ని, యోగాశ్రమ బృందాన్ని, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, అధికారులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# సంపాదకీయం




## సమర్పణ

వినయ విధేయతల పర్వదినం రంజాన్ అయితే, దాన ధర్మాల పర్వదినం బక్రీద్. అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్. ఇస్లాం ధార్మిక ప్రసంగాల (ఖుత్బా)సారాంశం 'హృదయంలోని సత్యమే అల్లా వరకూ చేరుతుంది'

సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతలనుంచి జనావళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ భూమండలానికి ప్రవక్తలను పంపించిన సందర్భాన్ని ఖురాన్ చెబుతోంది.

అల్లాహ్ పై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం గడపాలని మానవాళికి బోధిస్తున్న ప్రవక్తల్లో విశ్వాసాన్ని గ్రహించేందుకు అల్లాహ్ పరీక్షించిన ఘట్టం బక్రీద్ పండుగకు మూలం.

హజరత్ ఇబ్రహీం,అతని భార్య హాజీరాలకు సుదీర్ఘ కాలం తర్వాత అల్లాహ్ సంతానప్రాప్తి కలిగించారు.లేక లేక జన్మించిన కుమారుడు ఇస్మాయిల్ ను అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తరుణంలో ఒకరోజు రాత్రి ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయిల్ ను అల్లాహ్ పేరిట బలిదానం చేస్తున్నట్లు కలగంటాడు.అల్లాహ్ బలిదానం కోరుతున్నారని గ్రహించి కుమారుని బలిదానం (ఖుర్బాని)ఇచ్చేందుకు సిద్ధపడతాడు.ఇస్మాయిల్ కూడా అందుకు అంగీకరించాడు.వారి త్యాగ నిరతికి మెచ్చుకున్న అల్లాహ్ చివరి క్షణంలో వధ్య స్థానంలో ఇస్మాయిల్ ను తప్పించి ఒక పొట్టేలును ప్రత్యక్షపరుస్తారు.దాని గొంతు తెగి అల్లాహ్ మార్గంలో అది ఖుర్బాన్ అవుతుంది.ఇబ్రహీం త్యాగ నిరతికి మెచ్చిన అల్లాహ్ ఆరోజునుంచీ ఈదుల్ అజ్ హా(బక్రీద్)పండుగను కొనసాగించాలని నిర్దేశించినట్లు ఇస్లాం చెబుతోంది.

పేదలకు దానం ఇవ్వటం అనేది అంతర్లీనమైన భావన.ఖుర్బాని అంటే దానం,త్యాగం.సమర్పణ ద్వారా దైవ సాన్నిధ్యాన్ని పొందటం వంటిది అంతస్సారం.

రంజాన్, బక్రీద్ పర్వదినాలు ఈ సమాజానికిచ్చే సందేశమేమిటంటే.....
వర్షాలు కురవాలి.వాగులు,వంకలు నిండాలి.పొలాలు పచ్చపచ్చగా నవ్వాలి.కార్మిక కర్షక జనావళికి కడుపు నిండాలి.పేదవారికి ఊపిరందాలి. 'నా' అనే భావంలోంచి 'మనం' అనేది మొలకెత్తి మహావృక్షం కావాలి.స్వార్థపు గోడలు నిట్టనిలువునా కూలిపోవాలి.పరులకోసం చేసే త్యాగాలు హిమాలయాలవ్వాలి.చిన్నోళ్లు,పెద్దోళ్ళు, ఇంటివాళ్ళు,ఇరుగుపొరుగు వాళ్ళు అందరూ ఆనందంగా ఉండాలి.

ఇన్షా అల్లాహ్...!!!

# చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం

## ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ మీట్

**24.06.23 (మీడియాసెల్)**

చదువుతో పాటు క్రీడలకు కూడా ఆదికవి నన్నయ యూనివర్సిటీ తగిన ప్రాధాన్యం ఇస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. వర్సిటీలో రెండు రోజుల జరిగిన గోదావరి క్లస్టర్ అంతర్ విశ్వవిదాలయాల రీజినల్ స్పోర్ట్స్ శనివారం ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో జేఎన్టీయూకే ఉప కులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజుతో కలిసి నన్నయ వీసీ పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. క్రీడాస్ఫూర్తితో పయనిస్తూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించే దిశగా ముందంజ వేయాలని సూచించారు. స్టేడియంలో రూ.8.50 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జేఎన్టీయూకే వీసీ ఆచార్య ప్రసాదరాజు మాట్లాడుతూ, క్రీడలు శరీర దార్ఢ్యానికే కాకుండా మేధాసంపత్తి వృద్ధికి తోడ్పడతాయని అన్నారు. తొలుత విజేతలకు ఇద్దరు వీసీలూ బహుమతులు అందజేశారు.







**వీరే విజేతలు**

బాస్కెట్బాల్ మహిళల విభాగంలో 'నన్నయ', పురుషుల విభాగంలో జేఎన్టీయూకే విజేతలుగా నిలిచాయి. కబడ్డీ పురుషుల విభాగం లో జేఎన్టీయూకే, మహిళల విభాగంలో 'నన్నయ', వాలీబాల్ (పురుషులు, స్త్రీ విభాగాలు) 'నన్నయ', చెస్ మెన్స్ విభాగంలో జేఎన్టీయూకే, వుమెన్స్ విభాగంలో 'నన్నయ' విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఈసీ సభ్యుడు డా.బి.జగన్మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఆచార్య కె.రమణేశ్వరి, నన్నయ, జేఎన్టీయూకే క్రీడా కార్యదర్శులు డా. బి.రామ్ గోపాల్,డా. జి.శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యూజీ ప్రోగ్రాంపై అవగాహన



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ హాయర్ ఎడ్యుకేషన్ వైస్-ఛైర్మన్ ప్రొఫెసర్ కె. రామమోహనరావు ఇప్పటికే ఉన్న యూజీ ప్రోగ్రామ్‌ను సింగిల్ మేజర్‌గా మార్చడం గురించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అన్ని అనుబంధ కళాశాలలు (ప్రభుత్వ/ఎయిడెడ్/ అన్‌ఎయిడెడ్) ప్రిన్సిపాల్స్, సెక్రటరీ & కరస్పాండెంట్‌లందరికీ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో వీసి ఆచార్య పద్మరాజు,ఎకడమిక్ డీన్ ఆచార్య సురేష్ వర్మ, సిడిసి డీన్ ఆచార్య రమేశ్ గోదావరి జిల్లాల అనుబంధ కళాశాలల మేనేజ్మెంట్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



# ఎపి పిజిఇసిఇటి 2023 లో ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్, ఫార్మసీ విభాగం చివరి సంవత్సరం విద్యార్థులు ఇటీవల నిర్వహించిన AP PGECET 2023లో మంచి ర్యాంకులు సాధించారు. ఫార్మసీ కోర్సు 2019 ప్రారంభం నుండి మౌలిక సదుపాయాలు మరియు పుస్తకాలు లోటుపాట్లు ఉన్నప్పటికిని ఫార్మసీ అధ్యాపకుల మద్దతుతో విద్యార్థులు పట్టుదల మరియు ఆసక్తితో తమ జ్ఞానాన్ని సుసంపన్నం చేసుకొని విద్యార్థులు తీవ్ర సవాలుతో పరీక్షకు హాజరై 369, 496, 632, 1362 మరియు 1652 ర్యాంకులతో విజయం సాధించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొ.పద్మరాజు ఉత్తమ విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. మరియు ఇంచార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీ రమేష్ విద్యార్థులను పోటీ పరీక్షలకు మార్గనిర్దేశం చేసి సన్నద్ధం చేసినందుకు విద్యార్థులకు మరియు అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు, మరియు అధ్యాపకులు శ్రీ కె. నిత్యానంద్ రెడ్డి, శ్రీమతి ఎస్. లిఖిత మరియు శ్రీమతి పి.అరుణ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు

# నన్నయలో ఆచార్య ఎస్.టేకి స్మారక ఎఫ్.డి.పి ప్రోగ్రాం









ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య ఎస్.టేకి స్మారక ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధిలో ఆచార్య టేకి భాగస్వామ్యం ఎంతో ఉందని రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ఓ. ఎస్.డి మరియు విభాగాధిపతిగా విశ్వవిద్యాలయానికి ఎంతో సేవ చేశారని ఆయన పేరు మీద ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ డిజైన్ థింకింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.కార్యక్రమ కన్వీనర్ డా.ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఆచార్య టేకి కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగానికి వెన్నెముక అని యూనివర్సిటీలో మొట్టమొదటిగా అంతర్జాతీయ సదస్సులను ఆయన ప్రోత్సాహంతోనే ప్రారంభించామని, మేనేజ్మెంట్ ఫెస్టులు ఎన్నో నిర్వహించగలిగామని అన్నారు. ఆయనలేని లోటు డిపార్ట్మెంట్ పై చాలా ప్రభావాన్ని చూపిస్తుందని విద్యార్థులతో ఎంతో సఖ్యంగా ఉంటూ డిపార్ట్మెంట్ అభివృద్ధికి దోహదపడ్డారని ఆయన పేరుమీద ఈ కార్యక్రమం జరుపుతున్నామని అన్నారు. డిజైన్ థింకింగ్ అనేది ఒక నవ కల్పనలో భాగమని ఏ కార్యక్రమం చేయాలన్నా మంచి ఆలోచన మరియు ఎలా చేయాలనేది తెలుపుతుందని ఇటువంటి ప్రక్రియను తీసుకొని ఈ కార్యక్రమంలో చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎన్.ఎం.కె. భట్ట రిసోర్స్ పర్సన్ గా విచ్చేసారని తెలిపారు. ఆచార్య భట్ట మాట్లాడుతూ వినూత్న ఆలోచనలన, నూతన పోకడలను, సమస్య పరిష్కారాలను, నిర్ణయ ప్రక్రియలు ఇవన్నీ డిజైన్ థింకింగ్ లో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ విద్యార్థుల యొక్క సందేహాలను నివృత్తి చేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని టేకి పేరుమీద నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని ఆయన మరణం ఎంతో విచారాన్ని కలిగించిందని రీసెర్చ్ సెల్ డీన్ ఆచార్య కె. రమనేశ్వరి అన్నారు. డా.ఉమామహేశ్వరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఫ్యాకల్టీ ఎంతో ప్రయోజనాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్,వైఎస్సార్ ఆర్టికల్చర్ యూనివర్సిటీ ఫ్యాకల్టీ, అనుబంధ కళాశాలల మేనేజ్మెంట్ విభాగ అధ్యాపకులు, తాడేపల్లిగూడెం, కాకినాడ నన్నయ క్యాంపస్ అధ్యాపకులు, విద్యార్థులు, ఎంబీఏ విభాగానికి చెందిన అధ్యాపకులు డా. రాజేంద్రప్రసాద్, డా.పద్మవల్లి, డా.ఎలిస్ జాయ్, డా.రమేష్ మోటూరి, డా.ఐఎస్.ఎన్. రాజు, డా.రవిశంకర్, డా.అమ్మిరెడ్డి, డా. జోహార్ కృష్ణ పాల్గొన్నారు.



## క్యాంపస్ ప్లేస్మెంట్ విజేతలకు అభినందన

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆక్వా కల్చర్ మరియు జువాలజీ విభాగాల నుంచి క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో సెలెక్ట్ అయినటువంటి ఎం. ప్రశాంత్, ఎస్ జోసెఫ్ సిహెచ్ సాయికుమార్ విద్యార్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ప్రొఫెసర్ కె.పద్మరాజు అభినందించారు. విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని , అందరు విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ మరియు ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.రమనేశ్వరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా అవంతి ఫీడ్స్ లిమిటెడ్ కంపెనీ వారు విద్యార్థులను క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో రిక్రూట్ చేసుకుంటున్నారని తెలియజేశారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ మరియు జువాలజీ విభాగాధిపతి డా. విజయనిర్మల విద్యార్థులు ప్రతి సంవత్సరం క్యాంపస్ ప్లేస్మెంట్స్ లో రిక్రూట్ కావడం చాలా ఆనందంగా ఉందని తెలియజేశారు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డా.ఏ.మట్టారెడ్డి బయో కెమిస్ట్రీ విభాగాధిపతి డా.కళ్యాణి విద్యార్థులను అభినందించారు. డా. కె.సతీష్ కుమార్, ఆక్వాకల్చర్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు డా.శ్రీధర్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.




## గూడెం క్యాంపస్‌లో యోగా దినోత్సవం





ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ నందు తొమ్మిదవ అంతర్జాతీయ యోగ దినోత్సవం జరిగింది. ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ఆచార్య శ్రీరమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక, నైతిక విలువలు పెంపొందించుకునుటకు యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాపర్తి రామ యోగ ఇనిస్టిట్యూట్ సెక్రెటరీ డా.ఎం వీజీఎస్ శర్మ పాల్గొన్నారు. ఆయనతో పాటు యోగ ఇనిస్టిట్యూట్- కానవరం ప్రిన్సిపల్ ఎన్. శివశంకర్ రావు, కె.అప్పలరాజు మరియు శ్రీమతి వి.అపర్ణ పాల్గొని, యోగ ఉపయోగాలను వివరించారు. విద్యార్థులతో వివిధ రకాల యోగాసనాలు వేయించి వాటి వల్ల శారీరక మానసిక ఉల్లసానికి ఎలా తోడ్పడుతుందో తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ డా.కె.వి.ఎస్.ఎన్.రాజు అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాంపస్ వివిధ విభాగాధిపతులు యస్.పుత్రయ్య, ఎం.ఎన్.ఎన్. అప్పాజీ, డా.కె.ఎఫ్రాయిము బాబు, డా.హీరా బట్టు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన ఫార్మసీ విద్యార్థులు







ఆదికవి నన్నయ యూనివర్శిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ ఆఖరి సంవత్సరం విద్యార్థులు గుంటూరులోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కాలేజ్ నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భారతదేశంలోని ప్రముఖ కంపెనీలైన హెటెరో, అరబిందో మరియు యాక్సెలెంట్ లు కలిసి ప్లేస్‌మెంట్‌లో పాల్గొన్నారు. దీనిలో ముగ్గురు ఫార్మసీ విద్యార్థులు క్వాలిటీ కంట్రోల్ మరియు ప్రొడక్షన్ విభాగాలకు చెందిన రెండు కంపెనీలలో ఎంపికయ్యారు. విద్యార్థులు తమ విజయంతో సంతోషాన్ని వ్యక్తపరుస్తు వారిని ప్రోత్సహించిన వైస్ ఛాన్సలర్ మరియు అధ్యాపకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీరమేష్ ఎంపికైన విద్యార్థులను అభినందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు మరియు ఫ్యాకల్టీ శ్రీ కె.నిత్యానందన్ రెడ్డి, శ్రీమతి ఎస్.లిఖిత మరియు శ్రీమతి పి.అరుణ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మరో ముగ్గురు ఫార్మసీ విద్యార్థులు ఎంపికైనందుకు చాల సంతోషాన్ని తెలియజేసారు.

# ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజుకి శుభాకాంక్షలు అందించిన ప్రముఖులు



డా.వి.అనంతలక్ష్మి గారు
ప్రిన్సిపాల్ గవర్నమెంట్ మహిళా డిగ్రీ కాలేజీ,కాకినాడ




పి.శ్రీనివాసరావు ప్రభుత్వ న్యాయవాది




డా.మేరీ జోన్స్
ప్రిన్సిపాల్, రాజీవ్ గాంధీ కాలేజ్ రాజమండ్రి




పి.రాజు , బీ.ఎస్.ఎన్.ఎల్-జనరల్ మేనేజర్





డా.డి.వెంకటేశ్వరరావు
ప్రిన్సిపాల్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాలేజ్,పాలకొల్లు




డా.ఎస్.సత్యనారాయణ
ప్రిన్సిపాల్, సి.ఎస్.ఎన్ కాలేజ్,భీమవరం

# అత్యంత ప్రభావశీలుర 7 అలవాట్లు




ప్రతిభావంతులకంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుంది.ధైర్యం,సహనం, ఓపిక,వినయ విధేయతలు, ఏదైనా నేర్చుకోవాలనే ఉత్సాహం ఇటువంటి వ్యక్తిత్వం నుండే బయటకు వస్తాయి.ఇటువంటి వ్యక్తిత్వం బయటకు కనిపించదు గాని జీవితంలో దృఢంగా నిలబడడానికి సహాయపడుతుంది. ఇటువంటి వ్యక్తిత్వాన్ని సంపాదించే ఏడు అలవాట్ల గురించి రచయిత స్టీఫెన్ ఆర్.కవీ "అత్యంత ప్రభావశీలుర 7 అలవాట్లు" అనే పుస్తకంలో వివరించారు. మీరు ఏ రంగంలో ఉన్నా, ఏమి చేస్తున్నా ఈ పుస్తకంలో చెప్పిన 7 అలవాట్లు పాటించగలిగితే విజయవంతమైన వ్యక్తుల జాబితాలో ఒకరిగా నిలుస్తారని రచయిత గట్టి నమ్మకంతో చెప్పడం విశేషం. ఇప్పటికే వ్యక్తిత్వ వికాసం గురించి ఎందరో రచయితలు ఎన్నో పుస్తకాలు రచించడం జరిగింది. అయితే ఈ పుస్తకం మాత్రం వాటన్నింటికీ భిన్నం. ఇందులోని 7 అలవాట్లు పాటిస్తే సామాజికంగా, వ్యక్తిగతంగా,ఆర్థికంగా మన యొక్క వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవచ్చు. ఈ పుస్తకం నాలుగు భాగాలుగా వ్రాయబడి ఏడు అలవాట్ల గురించి వివరంగా చెప్పడం జరిగింది. ఆ ఏడు అలవాట్లు వరుసగా రాబోయే సమస్యలను ముందుగా అంచనా వేసి అందుకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకోవడం, చేసే పని యొక్క ముగింపు ని ముందే ఊహించడం, చేయవలసిన పనులను ముందే చేసుకోవడం,




ఎప్పుడూ గెలుపు గురించి ఆలోచన మనం మెదడులో ఉంచుకోవడం,ఏ విషయాన్ని అయినా ముందుగా అర్థం చేసుకొని తర్వాత మనల్ని మనం అర్థం చేసుకోవడం, భిన్నత్వాన్ని గౌరవించడం, మనల్ని మనం ఎప్పటికప్పుడు పదును చేసుకోవడం వంటి అలవాట్లు జీవితంలో భాగం చేసుకుంటే ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా విజయతీరాలకు చేరవచ్చని ఈ పుస్తకం తెలుపుతుంది. మన వ్యక్తిగత,వృత్తి పరమైన సమస్య పరిష్కారానికి కేవలం నైపుణ్యాలు, ఇతరుల మీద ఆధారపడకుండా మనల్ని మనం నమ్ముకోవడం ద్వారా ఆ సమస్యను పరిష్కారం చేసుకోవచ్చని ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. అందుకు ఈ 7 అలవాట్లు ముందుగా పెంపొందించుకోవాలి.అందుకోసం ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుంది. వ్యక్తిగతంగా ఒక మనిషిని పరిపూర్ణ వ్యక్తిగా చేసే ఈ పుస్తకం కొన్ని కోట్ల మంది జీవితాలను మార్చివేసిందనడంలో ఎటువంటి సందేహంలేదు.అందరూ చదవాల్సిన మంచి పుస్తకాలలో ఇదొకటి.

**బి,సుశాంత్**



## యోగాతో ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ తరఫున విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే సుబ్బారావు మాట్లాడుతూ యోగా ప్రతి మనిషి జీవితంలో ప్రత్యేక అభ్యాసం కావాలని శారీరక మానసిక వికాసం కలుగుతుందని తెలియజేశారు ప్రభుత్వ మరియు స్టేట్ ఎన్ఎస్ఎస్ సెల్ సూచనల మేరకు విద్యార్థులకు వక్తృత్వ వ్యాసరచన పోటీలను నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యా కళాశాల అధ్యాపకులు డా.గోపాలకృష్ణ, డా. సాంబశివరావు, డా.వరహాలు దొర, డా.సుజాత పాల్గొన్నారు

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in